వసతులున్నా.. నిరుపయోగం

- పర్యాటకులకు ఉపయోగపడని లేపాక్షి ఎంపోరియం
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న లేపాక్షి ఎంపోరియం

లేపాక్షి: పర్యాటక కేంద్రం లేపాక్షిలో నిర్మించిన ఎంపోరియం వసతులున్నప్పటికీ నిరుపయోగంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఎంపోరియం పర్యాటకులు, కళాకారులకు కాకుండా స్థానిక రైతులు పంట దిగుబడులు ఆరబెట్టుకోవడానికి ఉపయోగపడుతోంది. లేపాక్షి హస్తకళలకు ప్రసిద్ధి చెందినదని, ఇక్కడకు వచ్చే పర్యాటకుల కోసం లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. నాలుగు సంవత్సరాల క్రితం పర్యాటక శాఖ అధికారులు లేపాక్షిని సందర్శించి స్థానికంగా ఏఏ హ్యాండిక్రాఫ్ట్ ఉన్నాయో సర్వే చేశారు. లేపాక్షిలోని వీవర్స్ కాలనీలో నేస్తున్న చేనేత వస్త్రాలు, నంది విగ్రహం వెనుక భాగంలో తోలు బొమ్మలాటలు ఆడించే కళాకారులు, పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన ముద్దిరెడ్డిపల్లి చేనేతలు, కొండపల్లి కొమ్మలు తదితర వాటిపై ఆరా తీశారు. అయితే స్థానిక హస్తకళాకారులను ప్రోత్సాహించడంతో పాటు పర్యాటకులను ఆకర్షించే విధంగా పర్యాటక శాఖ నిధులతో ఎంపోరియం నిర్మించారు. ఈ ఎంపోరియంలో పట్టు చీరలు, డ్వాక్రా మహిళలు చేతి వృత్తులతో తయారు చేసిన వస్తువులు, తొలుబొమ్మలాట వస్తువులు, కొండపల్లి బొమ్మలను ఏర్పాటు చేస్తే పర్యాటకులు పెరుగుతారు. ఆదాయం పెరుగుతుందని, స్థానిక కళాకారులను ప్రోత్సాహించినట్టు అవుతుందని ఎంపోరియం ప్రారంభించారు. అయితే ప్రారంభించిన సంవత్సరం పాటు పర్యాటకులను ఆకర్షించేలాగా ఆటబొమ్మలు, వస్తువులు వ్యాపారాలు కొనసాగించారు. అనంతరం రెండు సంవత్సరాలుగా ఎంపోరియం నిరుపయోగంగా వుంది. జిల్లా ఉన్నతాధకారులు స్పందించి ఎంపోరియంను ఉపయోగంలోకి తీసుకు రావాలని చేనేతలు, కళాకారులు, పర్యాటకులు కోరుతున్నారు.

ఎంపోరియం వినియోగంలోకి తెస్తాం

ఏపీ టూరిజం శాఖ నిదులతో నిర్మించిన లేపాక్షి ఎంపోరియంను వినియోగంలోకి తెస్తాం. ఎంపోరియంలో చేనేతలు నేసిన వస్తువులను విక్రయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్ శాఖకు నివేదిక పంపాం. వారి నుంచి స్పందన రాలేదు. దీంతో సంవత్సరానికి రూ.3 లక్షల చొప్పున అద్దె కోసం టెండర్ల ఆహ్వానించాం.

– జయకుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి

క్లుప్తంగా

డీఈఓకు సన్మానం



డీఈఓను సన్మానిస్తున్న విద్యాధికారులు

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయిన డీఈఓ మీనాక్షిని మండల విద్యాశాఖ అధికారులు నాగరాజు, కుల్లాయప్ప, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ ఆమె సేవలు మరువలేనివన్నారు.

కరాటే పోటీల్లో పతకాలు



పతకాలు, సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులు

హిందూపురం: కర్ణాటక రాష్ట్రం చిక్కబళాపూర్ జిల్లా గౌరీబిందనూర్ సెన్షన్స్ స్కూల్‌లో నిర్వహించిన ఆరో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హిందూపురం విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారని మాస్టర్ రఫీక్ తెలిపారు. పోటీల్లో ఎల్ఆర్‌జి స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థినులు పాల్గొనగా ఇద్దరు బంగారు, ఒకరు సిల్వర్, నలుగురు రజతం పతకాల సాధించారన్నారు. విజేతలకు మాస్టర్స్‌తో పాటు రియాజ్‌బాషా, జనార్దన్‌రెడ్డి, అభినందించారు. అలాగే సూర్య రైఫిల్ షూటింగ్‌లో అంజిని మొదటి స్థానం, మనోజ్ఞ రెండో వస్థానం సాధించారన్నారు.

ధ్వజ స్తంభం ఊరేగింపు



ధ్వజ స్తంభాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో ఇటీవల చిత్ర లింగేశ్వరస్వామి దేవాలయాన్ని నూతనంగా నిర్మించారు. ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించేందుకు తమిళనాడు నుంచి రూ.2 లక్షలు వెచ్చించి ధ్వజ స్తంభాన్ని తీసుకొచ్చారు. ఆదివారం ధ్వజ స్తంభానికి భక్తులు, మహిళలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం డప్పు వాయిద్యాలతో గ్రామ వీధుల్లో ధ్వజ స్తంభాన్ని ఊరేగించారు. చివరగా ఆలయ ఆవరణలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. భక్తులకు ప్రసాద అందజేశారు. కార్యక్రమంలో యాదవ కులస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు యూడీఐడీ సర్టిఫికెట్లు



కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం: అఖిల భారతీయ సేవా సంస్థ ఆదివారం దివ్యాంగ సేవా కేంద్రంలో యూనిక్ డిసెబులిటీ ఐడీ కార్డులు పంపిణీ చేశారు. దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను రిటైర్డు డీఎస్పీ గిరిధర్ అందజేశారు. ఈ సర్టిఫికెట్లు దివ్యాంగులకు వైద్యసేవలు, ఆర్థిక సహాయం, ఆరోగ్య సంరక్షణ సేవలు, విద్య ఉపాధి వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పవన్, అనిల్ జైన్, రాకేష్ కుమార్, అరవింద్ జైన్, మానస, సైలెంద్ర తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పాల సంఘం ఎన్నికలు



ఎన్నికల కేంద్రం వద్ద ఎమ్మెల్యే వెంకటేశ్, నాయకులు

పావగడ: జిల్లా పాల ఉత్పత్తి సహకార సంఘం డైరెక్టర్ స్థానం ఎన్నికలు సజావుగా జరిగాయి. ఆదివారం తుమకూరు పట్టణంలోని ఎంప్రెస్ కళాశాల ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 58 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో బెళ్ళిబట్లు చంద్ర శేఖరరెడ్డి, బీజేపీ జేడీఎస్ కూటమి మద్దతుతో పళవల్లి చిన్న మల్లయ్య పోటీలో ఉన్నారు. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఈనెల 26వ తేదీన జరుగుతాయని ఎన్నికల అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఇద్దరిలో ఎవరు గెలిచినా రెండు లేదా మూడు ఓట్ల తేడాతో గెలిచే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తదితర నాయకులు ఎన్నికల సరళిని పరిశీలించారు.

వృద్ధాశ్రమానికి దారి చూపాలి



మాట్లాడుతున్న వృద్ధులు

మడకశిర రూరల్: మండల పరిధిలోని ఛత్రం పంచాయతీ పరిధిలోని తులసీదామ వృద్ధాశ్రమానికి దారి చూపాలని ఆశ్రమ వ్యవస్థాపకుడు తిమ్మప్ప కోరారు. వేణుగోపాలస్వామి ఆలయం వద్ద 22 సంవత్సరాల క్రితం అనాథ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పట్లో దారి కోసం ప్రయత్నించగా.. పక్కనే ఉన్న భూయాజమాని సర్వే వద్దని చెప్పడంతో ఆగిపోయామన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే దారిలో వేణుగోపాల స్వామి ఆలయానికి, ఆశ్రమానికి దాతలు, భక్తులు వస్తున్నారు. ఇటీవల ఆ దారిని మూసి వేయడంతో ఇబ్బందులు తలెత్తినట్లు పేర్కొన్నారు. భక్తులు, దాతలు ఆలయం, ఆశ్రమానికి వచ్చే వారు ఇబ్బంది పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే చేసి దారి చూపాలని స్పందనలో అర్జీలు కూడా ఇచ్చామన్నారు. దాతలు, భక్తులకు ఇబ్బంది లేకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని దారి చూపాలని కోరారు.

యాదవులు విద్యావంతులుగా ఎదగాలి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా వ్యాప్తంగా యాదవులు విద్యావంతులుగా ఎదిగి ఉన్నత పదవులు అలంకరించాలని శ్రీ క్షేత్ర వనకల్లు పీఠాధ్యక్షుడు డాక్టర్ బసవరమానంద స్వామి విద్యార్థులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎస్‌కే బయలు రంగ మందిరంలో నంద గోకుల మిత్రుల సంఘం, శ్రీమతి బోరమ్మ నాగరాజు ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని సంపదల కంటే జ్ఞాన సంపద శాశ్వతమైందన్నారు. విద్యార్థులు మొబైళ్లకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ చూపాలన్నారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలన్నారు.
ఇష్టంతో చదివితేనే పాఠాలు గుర్తుండి పోతాయన్నారు. ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఏటా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. పేద యాదవ విద్యార్థులను ఆదుకుంటామన్నారు. ఈ సందర్భంగా 80 శాతానికి పైగా ఉత్తీర్ణులైన 200 మంది పది, పీయూ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. అలాగే యాదవ సామాజిక వర్గానికి చెందిన నివృత్త ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముగదాళ బెట్ట నరసింహయ్య, జానపద గాయకుడు మోహన్ కుమార్ తదితర యాదవ సంఘం నాయకులు, రామమూర్తి స్వామిజీ, పాల్గొన్నారు.

గో పూజతో సర్వ దేవతారాధన



కైవారం తాతయ్య భజన మండలి సభ్యులు నగర సంకీర్తన చేస్తున్న దృశ్యం

హిందూపురం: గో పూజతో సర్వ దేవతారాధన చేసిన భాగ్యమని సద్గురు యోగి నారాయణ సేవా సమితి అధ్యక్షులు రవిశంకర్, రాజప్ప అన్నారు. కిరికెర పంచాయతీలో ఆదివారం గోపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కైవారం తాత విగ్రహానికి అభిషేకపూజలు చేశారు. అనంతరం 11 గ్రామాల నుంచి విచ్చేసిన కైవారం తాతయ్య భజన మండలి సభ్యులు నగర సంకీర్తన చేశారు. అనంతనం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సద్గురు యోగి నారాయణసేవ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



తనుశ్రీ

పెనుకొండ: ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17 బాలబాలికల బాల్‌బాడ్మింటన్ పోటీల్లో రాంపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని తనుశ్రీ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఈ మేరకు ఉపాధ్యాయులు పీడీ దివాకర్‌యాదవ్, నారాయణ స్వామి ఆదివారం తెలిపారు. ఈ నెల 29 నుంచి 30 వరకు బిక్కనోలు తూర్పు గోదావరి జిల్లాల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తనుశ్రీ పాల్గొంటుందని తెలిపారు.

అఖండ భజన



భజన చేస్తున్న భక్తులు

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున నూతనంగా నిర్మించిన సత్యసాయ భజన మందిరంలో బాబా జయంతి సందర్భంగా సత్యసాయి సంకీర్తనలతో 24 గంటల అఖండ భజన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, మండల సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వాల్మీకి విగ్రహావిష్కరణ



వాల్మీకి విగ్రహావిష్కరణ చేస్తున్న ఎంపీ

చిలమత్తూరు: మండలంలోని వీరాపురం పంచాయతీ లక్ష్మీపురంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించారు. వాల్మీకి విగ్రహానికి ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ మాట్లాడుతూ వాల్మీకుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు.



పేలుబండలో బోనాలను ఊరేగిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని పేలుబండలో ఆదివారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. గ్రామవీధుల గుండా ఊరేగింపుగా స్థానిక చెరువు వద్దకు వెళ్లి, గంగ పూజ నిర్వహించారు. మహిళలు బోనాలతో వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. డప్పు వాయిద్యాలతో యువతీ యువకులు నృత్యం చేస్తూ సందడి చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు వాల్మీకి కులస్తులు అన్నదానం చేశారు.

ఘనంగా టిప్పుసుల్తాన్ జయంతి



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ముక్కడిపేటలో హ్యూమనిజం ప్రతినిధి అజ్మతుల్లా ఆధ్వర్యంలో టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా సాధుచెట్టి సంఘం అధ్యక్షుడు జీవీ వెంకటస్వామి, అఖిలపక్ష ఉద్యమ నాయకుడు బాలాజీ మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టిప్పుసుల్తాన్ పాలనను వక్తలు కొనియాడారు. అనంతరం సామాజిక సేవకులు, టిప్పు సుల్తాన్ వేషధారణ వేసిన విద్యార్థులు, రక్త దాతలకు అవార్డులు, పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో దండోరా నాయకులు ఆనంద్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, మౌలానా ఇస్మాయిల్, మౌలానా ఉస్మాన్ ఘనీ, మౌలానా తన్వీర్ అహ్మద్, మౌలానా వసీఉల్లా, దాయి సాదిక్, ఉబెదుల్లా హుసేన్, ముస్తఫా ఖాన్, రియాజ్, అమానుల్లా, హాజీ సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



రోబోటిక్స్ అవగాహన కార్యక్రమంలో నిర్వాహకులతో విద్యార్థులు

పరిగి: నిత్యం కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని రోబోటిక్ సంస్థ సభ్యుడు వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం సేవామందిరం జెడ్పీహెచ్ఎస్‌లో బెంగళూరుకు చెందిన ప్రముఖ నెక్స్ జన్ రోబోటిక్స్ లర్నింగ్ అండ్ మెషీన్ లర్నింగ్ వర్క్‌షాప్ నేతృత్వంలో స్థానిక భగత్ సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో రోబోలు కీలకంగా మారనున్నాయన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోబోటిక్స్ సంస్థ సభ్యులు శ్రీధర్, ఉపాధ్యాయులు రామలింగయ్య, అరుణ్, భగత్ సింగ్ సేవాసమితి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



హిందూపురం: పట్టణంలోని డీబీ కాలనీలో ఉన్న హేమలతారెడ్డి ఇంట్లో ఆదివారం బ్రహ్మకమలాలు విరబూశాయి. చుట్టుపక్కల మహిళలు బ్రహ్మకమలాలకు పూజలు చేసి హారుతులిచ్చారు.

శుభకార్యం

రొద్దం: మండలంలోని బొక్సంపల్లి గ్రామ సర్పంచ్ విశ్వనాథ్‌రెడ్డి సోదరుడు దర్శన్‌రెడ్డి, లక్ష్మీమానస వివాహ వేడుకకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్ ఆదివారం హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.
అమరాపురం: హిందూపురం పట్టణంలోని వాల్మీకి భవన్‌లో ఆదివారం అమరాపురం మండలం ఆలదపల్లి గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి కుమారుడి వివాహం జరిగింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వై.టి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు వివాహ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పరామర్శ

గుడిబండ: మండల పరిధిలోని కురుబరపల్లి గ్రామానికి చెందిన ఈరనాగప్పను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆదివారం పరామర్శించారు. ఇటీవల ఈరనాగప్ప ద్విచక్ర వాహనం నుంచి పడటంతో స్వల్పంగా గాయపడ్డాడు. హిందూపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సమన్వయకర్త ఈరలకప్ప ఆసుపత్రికి వెళ్లి ఈరనాగప్పను కలిశారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

గుండెపోటుతో సీపీఐ నాయకుడి మృతి

లేపాక్షి: కంచిసముద్రం పంచాయతీ పరిధిలోని ఐదుకళ్లు సదాశివనగర్‌కు చెందిన సీపీఐ నాయకుడు గంగన్న(65) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. అతడికి ఒక కుమారుడు ఉన్నాడు. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు దాదాపీర్, దాదు, శివప్ప, నారాయణరెడ్డి, గోవిందప్ప, గౌతమ్, వెంకటేశప్ప తదితరులు అక్కడికు వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఆదివారం ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. పెనుకొండ వైపు వెళ్లే ద్విచక్ర వాహనాన్ని హిందూపురం వైపు వెళ్లే ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. అయితే వాహనచోదకులు ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఇతర వాహనంలో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

వృద్ధాశ్రమానికి తరలింపు



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్ బాబు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద శనివారం రాత్రి నుంచి ఒంటరిగా ఉన్న ఓ వృద్ధురాలిని మాతృశ్రీ ఓల్డేజ్ హోం సిబ్బంది తీసుకువెళ్లారు. ఆదివారం ఎస్ఐ రమేష్ బాబు అక్కడికి చేరుకొని ఆ వృద్ధురాలికి అల్పాహారంతో పాటు ఖర్చులకు డబ్బులు ఇచ్చారు. ఆమె స్వస్థలం చెప్పలేకపోతోందని ఎస్ఐ తెలిపారు. వృద్ధురాలి బాగోగులు చూసుకుంటామని ఓల్డేజ్ హోం నిర్వాహకురాలు అరుణ జ్యోతి తెలిపారు.

సత్యసాయి బాబా జయంతి వేడుకలు



సత్యసాయి భజన మందిరంలో చిన్నారుల నృత్యప్రదర్శన

హిందూపురం: స్థానిక పాండురంగనగర్‌లోని సత్యసాయి భజన మందిరంలో ఆదివారం రాత్రి బాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి బాబా మండలి ఆధ్వర్యంలో సాయిబాబా చిత్రపటానికి విశేష పూజలు నిర్వహించి భజనలు చేపట్టారు.అనంతరం చిన్నారులచే భక్తి సంగీతాల నృత్యాలు ప్రదర్శించారు. సాయిబాబా భక్తమండలి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు



ఆలూడీలో దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్ఓలు



రొళ్ల మండలం రత్నగిరిలో ఓటరు నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి



లేపాక్షిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

అగళి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు హక్కు కల్పిస్తామని తహసీల్దార్ సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం, ఆదివారం మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమంలో 31 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అర్హులైన యువతీ, యువకులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ గుర్రన్న, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పరిశీలన

రొళ్ల: మండల వ్యాప్తంగా 32 పోలింగ్ స్టేషన్‌లో పరిధిలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదును ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పర్యవేక్షించారు. ఓటరు కార్డుల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులపై ఆరా తీశారు. ఫారం–6 కోసం 10, ఫారం–7 కోసం 6 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండనున్న వారితో కొత్తగా ఓటరు నమోదుకు ఫారం–6 దరఖాస్తులు స్వీకరించాలన్నారు. శాశ్వతంగా గ్రామాల్లో లేని వారు, మరణించిన వారి పేర్లను కుటుంబ సభ్యుల అనుమతి తీసుకుని ఓటరు జాబితా నుంచి తొలగించాలని బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 18 దరఖాస్తులు

లేపాక్షి: మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి 18 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. లేపాక్షిలోని 10 పోలిగ్ కేంద్రాలల్లో నిర్వహిస్తున్న ఓటరు నమోదును తహసీల్దార్ పరిశీలించి బీఎల్ఓలకు తగు సూచనలు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. విక్రేత అరెస్ట్

మడకశిర: నియోజకవర్గంలో ఆదివారం విస్తృతంగా దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. రొళ్ల మండలం అలుపనపల్లిలో నవీన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 25 కర్ణాటక టెట్రా మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.